క్లుప్తంగా

ప్రశాంతంగా నీట్ పరీక్ష



పరీక్షా కేంద్రంలోనికి వెళ్తున్న విద్యార్థులు

మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నీట్ అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్, అల్మాస్‌గూడలోని ఆర్కా ఇంటర్నేషనల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో మొత్తం 984 మంది విద్యార్థులకు గాను 971 హాజరైనట్లు మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు భరోసా

మంత్రి సబితారెడ్డి



చెక్కు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా ఇస్తుందని మంత్రి సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ నందిహిల్స్‌కు చెందిన పుష్పలత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.లక్షా 25 వేల చెక్కును ఆదివారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సబితారెడ్డి.. పుష్పలత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్, 9వ డివిజన్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి రామిడి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశమైన వినాయకహిల్స్ కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ ఫేస్–2 కాలనీలో ఆదివారం సమావేశమైన కాలనీవాసులు బీసీ, ఎస్సీ, ఎస్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శిగా మహేష్ సాగర్, కోశాధికారిగా బుచ్చిబాబు, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీ సమస్యలపై పోరాడుతామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: 11కేవీ మన్సూరాబాద్, సొంత్ ఎండ్‌పార్కు ఫీడర్ల పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 11కేవీ హుడాసాయినగర్, ఆటోనగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

సరూర్‌నగర్ సభకు తరలిరండి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్

కందుకూరు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ నిరసన ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రియాంక గాంధీ విచ్చేయనున్నారన్నారు. మండలం నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు అజీజ్, భూపాల్‌రెడ్డి, వెంకటేశ్, మల్లయ్య, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా సభకు తరలిన నాయకులు

మహేశ్వరం: సరూర్‌నగర్ స్టేడియంలో బీఎస్పీ ఆధ్వర్యంలో తెలంగాణ భరోసా సభకు మహేశ్వరం మండలం నుంచి బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నర్సింహ ఆధ్వర్యంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆర్‌ఎస్.ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఎస్పీతోనే సామాజిక న్యాయం సాధ్యమన్నారు. ఆ దిశగా నాయకులు పనిచేయాలన్నారు. సభకు తరలినవారిలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు, కందుకూరు మండల కన్వీనర్ సురేష్, మహేశ్వరం మండల ఉపాధ్యక్షులు పవన్, మండల కార్యదర్శి మహేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి దయాకర్ తదితరులు ఉన్నారు.

హైవేపై మురుగు పరుగు



శ్రీశైలం హైవే షాహిన్‌నగర్ వద్ద నిలిచిన మురుగు

- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీశైలం హైవే రోడ్డుపై మురుగు పరుగులు పెడుతోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి రహదారులు వేస్తున్నా మురుగు పారడంతో రోడ్డు కోతకు గురై పాడైపోతోంది. 2019లో రూ.9 కోట్ల వ్యయంతో పహడీషరీఫ్ నుంచి ఎర్రకుంట వరకు నూతన రహదారిని నిర్మించారు. అలాగే 2021 నవంబర్‌లో షాహిన్‌నగర్‌లోని స్టార్ ఫంక్షన్‌హాల్ నుంచి ఎర్రకుంట వరకు 5 కిలోమీటర్ల మేర నూతన రహదారి వేసేందుకు రోడ్డును కొద్దిమేర తవ్వినప్పటికీ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. గతంలో కూడా ఇలాగే పనులను అర్ధంతరంగా నిలిపివేయడంతో ఇబ్బందులు పడ్డామని స్థానికులు తెలిపారు. అయితే హైవేపై మురుగు నిలుస్తుండటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి హైవే పరిధిలో వచ్చే రహదారి పనులు పూర్తిచేయడంతో పాటు మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు వెళ్లే హైవేపై మురుగు నిలుస్తుడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే నియోజకవర్గంలో వచ్చే కందుకూర్, తుక్కుగూడ లాంటి పట్టణాలను ఎంతో అభివృద్ధి చేస్తున్నారు.. జల్‌పల్లి మున్సిపాలిటీని మాత్రం పట్టించుకోవడంలేదు. ఎక్కడ పడితే అక్కడ మురుగు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

– హమీద్ ఖాన్, షాహిన్‌నగర్

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నారు

మాజీ ఎమ్మెల్యే రాములు

తుర్కయంజాల్: కేంద్రంలోని మోడీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు అన్నారు. సీపీఐ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు చేపట్టిన 'మోడీ కో హఠావో దేశ్ కో బచావో' కార్యక్రమం ముగింపు సభకు రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకుల ధరలు 100 శాతానికి పైగా పెరిగాయని, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ దోచిపెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యాదయ్య, సీపీఐ పార్టీ జిల్లా నాయకుడు అలీమొద్దీన్, సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు కిషన్, సీపీఐ నాయకులు యాదయ్య, రాజునాయక్, శ్రీనునాయక్, కాటంరాజు, భాస్కర్, శేఖర్ రెడ్డి, సుందరమ్మ, కృష్ణ, విజయ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

అంత్యక్రియలకు ఆర్థికసాయం

రంగారెడ్డి జిల్లా: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో నివాసం ఉంటున్న తులసమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. పేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించడంతో పాటు బడంగ్‌పేట శ్మశానవాటికలో వృద్ధురాలి అంత్యక్రియలకు అవసరమైన ఏర్పాట్లు చేయించారు.

అష్టలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులకు సన్మానం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ లోని వాసవి కాలనిలో అష్టలక్ష్మీ దేవాలయ బ్రహ్మోత్సవాలను విజయవంతం కావడానికి కృషి చేసిన బ్రహ్మోత్సవాల కన్వీనర్ గొరిశెట్టి అరుణ్ సేవలు అభినందనీయం అని ఆలయ చైర్మన్ సోమ సురేష్ అన్నారు. ఆదివారం దేవాలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో కమిటీ సభ్యులందరూ కలిసి అరుణ్ ను ఘనంగా సన్మానించారు. చైర్మన్ సోమ సురేష్ మాట్లాడుతూ ఈ బ్రహ్మోత్సవాలకు హైదరాబాద్ నగరం నుండే కాకుండా తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులందరూ కృషి చేశారని తెలిపారు.

అంగన్‌వాడీలకు బీరువాల బహూకరణ

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలకు స్థానిక సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం బీరువాలను బహూకరించారు. ఆయన మాట్లాడుతూ.. ఆరుట్ల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్టర్లు, రికార్డులు భద్ర పర్చుకోవడం కోసం తమవంతు సహకారంగా బీరువాలను వితరణ చేశామని అన్నారు. గ్రామంని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.40వేల విలువ చేసే బీరువాలను అందజేశామని తెలిపారు. ఉప సర్పంచ్ జంగయ్య గౌడ్, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు జంగమ్మ, విజయ, రమేశ్వరమ్మ, వైదేహి, జ్యోతి, పద్మ, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సహకరించండి

ఆమనగల్లు: వరిధాన్యం కొనుగోలుకు రైస్‌మిల్లర్లు సహకరించాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ కోరారు. పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఆదివారం ధాన్యం సేకరణకు ఎంపిక చేసిన రైస్ మిల్లర్లతో చైర్మన్ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది వరిధాన్యంలో తేమ శాతం ఎక్కువ ఉన్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు చేయలేమని రైస్‌మిల్లర్లు అన్నారు. ప్రభుత్వానికి తాము క్వింటాల్‌కు 67 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉంటుందని ప్రస్తుతం వస్తున్న వడ్లలో క్వింటాల్‌కు 60 కిలోల బియ్యం కూడా రావడం లేదని దీనివల్ల తాము నష్టపోతామని రైస్‌మిల్లర్లు వివరించారు. అధికారుల దృష్టికి తీసుకుపోయి మిల్లర్లకు అన్యాయం జరగకుండా చూస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు.

స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మామిడి హరికృష్ణ

హస్తినాపురం: స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించి వాటిని వినియోగించుకున్నప్పుడే గ్రామీణ ప్రాంత ఉత్పత్తిదారులు అభివృద్ధి చెందుతారని భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలను స్థానిక ఉత్పత్తుల కేంద్రం నిర్వాహకులు భరత్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు ప్రభాకర్, శారద, ధీరజ్, శ్రీనివాసరావు, రమేశ్‌రెడ్డి, కాంతారావు, హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష

యాచారం: దళితబంధు పథకంలో అవనీతికి పాల్పడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ యాచారంలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు చేస్తున్న నిరసన దీక్ష ఆదివారానికి నాలుగోరోజుకు చేరింది. సాక్ష్యాత్తు సీఎం కేసీఆర్.. దళితబంధు పథకంలో అవనీతి జరుగుతోందని చెప్పారంటే అవినీతి ఏ రేంజ్‌లో ఉందో అర్థమవుతోందన్నారు. అవినీతి ఎమ్మెల్యేల చిట్టా బయటపెట్టాలన్నారు. నాయకులు కృష్ణ, శ్రీకాంత్, ఆనంద్, యాదయ్య, వినోద్ పాల్గొన్నారు.

క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తోందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆదివారం వాలీబాల్ కిట్లను ఆయన అందజేశారు. త్వరలో కడ్తాల్ పట్టణంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, క్రీడాకారులు అనిల్‌గౌడ్, మల్లేశ్, నరేశ్, మురళీ, యాదగిరి, రవి, కుమార్, సంజయ్ తదితరులు ఉన్నారు.



క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో ఆదివారం పెద్దమ్మ, గంగమ్మతల్లి దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. అనంతరం గ్రామస్తులు బోనాలతో అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, సర్పంచ్ ఇందిర, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో ఆదివారం జరుగుతున్న లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. చైర్‌పర్సన్ ఆర్తిక, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, మహేందర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



యాచారం: పూజలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

మహేశ్వరం: మండల పరిధిలోని ఆకన్‌పల్లి గ్రామంలో నాభిశిలా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండోరోజు (ఆదివారం) ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలో బొడ్రాయి నాభిశిలా విగ్రహానికి అభిషేకం, హారతి, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్ దంపతులు, మహేశ్వరం ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొత్త మనోహర్‌రెడ్డి, ఆకన్‌పల్లి గ్రామ సర్పంచ్ ముక్కెర యాదయ్య, ఉప సర్పంచ్ గురుప్రీత్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, నియోజకవర్గ బీఆర్‌ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు వి.మల్లేష్ యాదవ్, మండల అధ్యక్షుడు రాజునాయక్ తదితరలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గా దీప్‌లాల్ దంపతులు

మీర్‌పేటలో ఘనంగా మేడే వారోత్సవాలు



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మీర్‌పేట: మేడే వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మీర్‌పేట లెనిన్‌నగర్‌లో సీఐటీయూ నాయకులు జెండావిష్కరణ చేశారు. అనంతరం బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశవర్కర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సుజాత, కార్యదర్శిగా భాగ్యలక్ష్మీ, సహ కార్యదర్శిగా అనిత, కోశాధికారిగా సుజాత, సభ్యులుగా బాలమణి, సుమలత, లీలావతి, వరలక్ష్మీ, హేమలత, రజిని ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దాసరి బాబు, యాదగిరిచారి, పెంటయ్య పాల్గొన్నారు.

లేమూరులో క్రికెట్ పోటీలు ప్రారంభం

కందుకూరు: ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని లేమూరు, సరస్వతీగూడ, అగర్‌మియాగూడ గ్రామాలకు చెందిన ముదిరాజ్ క్రీడాకారులకు ఆదివారం లేమూరులో క్రికెట్ పోటీలను నిర్వహించారు. సర్పంచ్‌లు పరంజ్యోతి, రాము ముదిరాజ్, భూపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకులు బాబురావు, గణేష్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులకు డ్రెస్‌లను అందించారు. యువత నిత్యం క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ఎడ్ల శ్రీహరి, కాల్వ శ్రీహరి, జగదీష్, రామకృష్ణ, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు అంజయ్య, కోశాధికారి రవీందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు డ్రెస్‌లు అందజేస్తున్న అతిథులు

ఆలయాల అభివృద్ధికి నిధుల మంజూరు

తుక్కుగూడ: నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి సబితారెడ్డికి తుక్కుగూడ మున్సిపల్ బీఆర్‌ఎస్ యువజన నాయకులు బాకారం వెంకటరాజీరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఇమామ్‌గూడలో ఆయన మాట్లాడారు. శ్రీనగర్ (ఫ్యాబ్‌సిటీ) ఆదిలక్ష్మి అలివేలు మంగా సమేత బాలాజీ వేంకటేశ్వర సమేత ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రూ.కోటి నిధులు మంజూరు చేయించిన మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధులతో ఆలయ అభివృద్ధితో పాటు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించవచ్చన్నారు. నిధుల మంజూరుపై నియోజకవర్గంలో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేణుగోపాలస్వామి ఆలయానికి..

రంగారెడ్డి జిల్లా: బాలాపూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయానికి రూ.కోటి నిధులు మంజూరైనట్లు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వంగేటి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 6వ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ కింద దేవాలయాల అభివృద్ధికి మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో ఆలయానికి నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి సబితారెడ్డికి బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని బీఆర్‌ఎస్ నాయకులతో పాటు, బాలాపూర్ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు.. శ్రీనివాస్‌రెడ్డి, గిరీష్, మాజీ సర్పంచ్ రఘునందన్ తదితరులున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

మాజీ ఎంపీటీసీ తావునాయక్

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి గ్రామంలో ఆదివారం మేడే వారోత్సవాలు ఘనంగా జరిగాయి. మాజీ ఎంపీటీసీ తావునాయక్ ఆధ్వర్యంలో గ్రామంలో జెండావిష్కరణ చేసి వేడుకలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల రైతాంగం, పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ఇలానే కొనసాగితే ఉద్యమాలను ఉధృతంచేస్తామని అన్నారు. నాయకులు..చందునాయక్, పాపయ్యాగౌడ్, నరేందర్, వెంకటయ్య, నర్సింహ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక సభను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగోలు: నిరుద్యోగుల కోసం సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం జరిగే యువ సంఘర్షణ సభకు యువత భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాగోలు డివిజన్ నాయకులు మంజులరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నాగోలు డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీ, లలితనగర్, సర్వేనెంబర్ 58లో ప్రచారం నిర్వహించారు. సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్, యువ సంఘర్షణ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ హాజరవుతున్నందున యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



నాగోలు: సరూర్‌నగర్ చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సరూర్‌నగర్ చెరువులో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు సరూర్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సరూర్‌నగర్ పోలీస్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతి చెందిన వ్యక్తి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించ లేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు.

ఆమనగల్లులో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

ఆమనగల్లు: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కొన్నేళ్లుగా ఆమనగల్లుతో పాటు పలు మండలాల్లో శృతిలయ కల్చరల్ అధ్యక్షుడు చిత్తరంజన్‌దాస్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.సంగీతం,నృత్యం, చిత్రలేఖనంలాంటి వాటిలో శిక్షణ ఇస్తున్నారు. శృతిలయ అకాడమీ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సలహాదారుడు తిరుపతిగౌడ్, అభినవరెడ్డి, నాగార్జున, మల్లేశ్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాము